సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 25 । జూలై । 2023



విస్తృత పరిశోధనలు
నిర్మాణ రంగంలో అత్యాధునిక సాంకేతిక పద్ధతులను తీసుకురావడానికి విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయని ముంబై ఐఐటీ ప్రొఫెసర్ నందగోపాల్ అన్నారు. 8లో ▸



ప్రాజెక్టులకు జలకళ
ఎడతెరపి లేని వర్షాలకు ఏజెన్సీ ప్రాంతంలోని ప్రాజెక్టులు, చెరువులకు భారీగా వరద నీరు వచ్చి చేరడంతో నిండు కుండలా మారాయి. 8లో ▸

ఈ-క్రాప్.. రైతు సేవలో టాప్
రైతులు తమ పంట వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవడం ద్వారా ప్రభుత్వం పలు ప్రయోజనాలను కల్పిస్తోంది.
విత్తనాలు, ఎరువులు, యంత్రాలను సబ్సిడీపై అందిస్తోంది.



8లో

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన కేరళ బృందం



కేరళ బృందంతో చర్చిస్తున్న కలెక్టర్

భీమవరం(ప్రకాశం చౌక్): స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం పాపులేషన్ రీసెర్చ్ సెంటర్, సెంట్రల్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా కేరళ బృంద నాయకుడు ఒమెన్ మాథ్యూస్, సహాయకులు సచిన్ జిల్లా వైద్యాధికారులతో కలిసి కలెక్టర్ పి.ప్రశాంతిని కలిశారు. ఈనెల 20వ తేదీ నుంచి జిల్లాలోని తణుకు, భీమవరం ఆస్పత్రులు, ఆకివీడు సీహెచ్‌సీ, యండగండి పీహెచ్‌సీ, కలిగొట్ల సబ్ సెంటర్లను ఈ బృందం పరిశీలించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్య పథకాలు, కార్యక్రమాలపై అధ్యయనం చేసిన బృంద సభ్యులు సంతృప్తి చేశారు. వీటిపై కలెక్టర్‌తో చర్చించారు. డీఎంహెచ్ఓ డి.మహేశ్వరరావు, అదనపు డీఎంహెచ్ఓ బి.భానునాయక్, స్టాటిస్టికల్ అధికారి ఎంఎస్ ప్రసాద్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ సూచించారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన జిల్లాస్థాయి పోలీస్ స్పందనలో ప్రజల నుంచి ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ తప్పక ధరించాలన్నారు. సైబర్ నేరగాళ్లు బ్యాంక్ ఖాతాలకు కేవైసీ చేయాలని చెప్పి పంపించే మెసేజ్‌లను, ఓటరు కార్డుకు పాన్‌కార్డును అనుసంధానించాలని చెబుతూ పంపే లింకులకు స్పందించవద్దన్నారు. ఉచిత బహుమతులు అంటూ వచ్చే సందేశాలపైనా అప్రమత్తంగా ఉండాలన్నారు. స్పందనలో 13 ఫిర్యాదులు స్వీకరించారు.

ఏకధాటిగా వర్షం

ఏలూరు(మెట్రో): ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఏకధాటిగా వర్షం కురుస్తోంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో మరో రెండు, మూడు రోజులపాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో సోమవారం 20 మి.మీకు పైగా సగటు వర్షపాతం నమోదై ఉంటుందని అంటున్నారు. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు పశ్చిమగోదావరి జిల్లాలో 8.9 మి.మీ సగటు వర్షపాతం నమోదు కాగా అత్యధికంగా మొగల్తూరులో 24.2 మి.మీ, కాళ్లలో 18.2 మి.మీ, ఉండిలో 17.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఏలూరు జిల్లాలో 25.1 మి.మీ సగటు వర్షపాతం నమోదు కాగా అత్యధికంగా ముదినేపల్లిలో 101.2 మి.మీ, కైకలూరులో 54.2 మి.మీ, మండవల్లిలో 43.8 మి.మీ వర్షపాతం నమోదైంది.

స్వాతంత్య్ర వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో స్వాతంత్య్ర దినోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సన్నాహక ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. పంచాయతీ స్థాయిలో సర్పంచ్ జెండా ఆవిష్కరణ చేయాలని, అలాగే మండల, డివిజన్ స్థాయిల్లోని వేడుకలు నిర్వహించాలన్నారు. గతేడాది మాదిరిగా కలెక్టరేట్‌ను ఆనుకుని ఉన్న పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకు భీమవరం ఆర్డీఓ ఇన్‌చార్జిగా ఉంటారన్నారు. ఈ మేరకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. డీఆర్వో కె.కృష్ణవేణి, భీమవరం ఆర్డీఓ దాసి రాజు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నేడు స్పందన పరిష్కారాలపై సమీక్ష

ఏలూరు(మెట్రో): ఏలూరు, నూజివీడు డివిజన్ల పంచాయతీ కార్యదర్శులు, ఈవోపీఆర్డీలు, డీఎల్‌పీవోలతో మంగళవారం ఏలూరు జెడ్పీ సమావేశ మందిరంలో స్పందన పరిష్కారాలపై సమీక్ష నిర్వహించనున్నట్టు జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఓ ప్రకటనలో తెలిపారు. వరద సహాయక కార్యకలాపాల్లో ఉన్నందున జంగారెడ్డిగూడెం పంచాయతీ శాఖ సిబ్బందిని మినహాయించామని పేర్కొన్నారు. సమయపాలన ఆధారంగా పిటీషన్ల పరిష్కారం, గుణాత్మక పద్ధతిలో పరిష్కారాలు తదితర అంశాలపై సమీక్షిస్తామని తెలిపారు. ముఖ్యంగా అనధికార లేఅవుట్లు, ఆక్రమణలు, పారిశుద్ధ్యం, తాగునీరు, పంచాయతీ నిధుల దుర్వినియోగం, చేపల చెరువుల పిటీషన్ల తీరుపై సమీక్షిస్తామని పేర్కొన్నారు.

సాధికారత.. సంక్షేమ బాట

డ్వాక్రా మహిళలకు వరం
- స్వయం సహాయక సంఘాలకు సున్నా వడ్డీ వర్తింపు
- రేపు నాలుగో విడత వడ్డీ సొమ్ముల విడుదల
- ఉమ్మడి జిల్లాలో 76,819 గ్రూపులు
- 8.38 లక్షల మందికి రూ.114.75 కోట్ల మేర లబ్ధి



సున్నా వడ్డీపై చర్చించుకుంటున్న డ్వాక్రా మహిళలు (ఫైల్)

ఏలూరు (టూటౌన్): మహిళా సాధికారత, ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. మహిళల ఆర్థిక పరిపుష్టి, స్వయం ఉపాధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారు. ఈ దిశగా స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా) మహిళలకు పెద్ద ఎత్తున బ్యాంకు లింకేజీ రుణాలు అందజేస్తున్నారు. వీటితో మహిళల ఉపాధికి బాటలు వేస్తున్నారు. అలాగే ఆసరా, చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తం వంటి పథకాలతోనూ ఆర్థికంగా ఆదుకుంటున్నారు. దీంతో పాటు డ్వాక్రా రుణాలకు వైఎస్సార్ సున్నావడ్డీ పథకాన్ని వర్తింపజేస్తున్నారు. బ్యాంకుల్లో రుణాలు తీసుకుని క్రమం తప్పకుండా చెల్లిస్తున్న డ్వాక్రా సంఘాలకు వడ్డీ రాయితీని ప్రభుత్వం అందిస్తోంది. ఇప్పటికే మూడు విడతలుగా సున్నా వడ్డీ నిధులను మహిళా సంఘాల ఖాతాలకు జమచేయగా.. నాలుగో విడత వడ్డీ రాయితీ నిధులను బుధవారం (ఈనెల 26న) సీఎం జగన్ విడుదల చేయనున్నారు.

సున్నావడ్డీ పథకాన్ని వర్తింపజేసేదిలా..
2022 ఏప్రిల్ 1 నుంచి ఈ ఏడాది మార్చి 31 వరకూ బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న డ్వాక్రా సంఘాలు వాటిని సక్రమంగా వాయిదాలు చెల్లిస్తున్న గ్రూపులకు వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం వర్తిస్తుంది. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలో డీఆర్‌డీఏ, మెప్మా అధికారులు ఈ ఏడాది జనవరి నుంచి కసరత్తు ప్రారంభించి ఆన్‌లైన్‌లో వివరాలు పొందుపర్చారు. సంఘాలు అప్పు తీసుకున్న తేదీ, అప్పు మొత్తం, పొదుపు ఖాతా పుస్తకాల నంబర్లు, బ్యాంకుల ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ తదితర వివరాలను మండల స్థాయిలో అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. పల్లె ప్రాంతాల గ్రూపులు డీఆర్‌డీఏ పరిధిలో, పట్టణ ప్రాంతాల గ్రూపులు మెప్మా పరిధిలో ఉన్నాయి.

నాలుగో విడత సున్నా వడ్డీ పథకం

జిల్లా	డీఆర్‌డీఏ పరిధిలో లబ్ధిదారులు	మెప్మా పరిధిలో లబ్ధిదారులు	మొత్తం లబ్ధి (రూ.కోట్లలో)
ఏలూరు	4,21,572	45,834	61.74
పశ్చిమగోదావరి	3,12,705	58,485	53.01

లబ్ధిదారులు ఇలా..

ఏలూరు జిల్లా
- మొత్తం 42,404 గ్రూపులకు చెందిన 4,67,406 మంది మహిళలకు సుమారు రూ.61.74 కోట్లు లబ్ధి చేకూరనుంది.
- దీనిలో డీఆర్‌డీఏ పరిధిలో 37,958 గ్రూపులకు చెందిన 4,21,572 మందికి రూ.53.79 కోట్లు.
- మెప్మా పరిధిలో 4,446 గ్రూపులకు చెందిన 45,834 మంది మహిళలకు సుమారు రూ.7.96 కోట్ల ప్రయోజనం కలగనుంది.

పశ్చిమగోదావరి జిల్లా
- మొత్తం 34,415 గ్రూపులకు చెందిన 3,71,190 మంది మహిళలకు సుమారు రూ.53.01 కోట్ల మేరకు లబ్ధి చేకూరనుంది.
- దీనిలో డీఆర్‌డీఏ పరిధిలో 28,874 గ్రూపులకు చెందిన 3,12,705 మందికి రూ.42.86 కోట్లు.
- మెప్మా పరిధిలో 5,541 గ్రూపులకు చెందిన 58,485 మందికి రూ.10.15 కోట్ల మేర ప్రయోజనం కలగనుంది. వరుసగా సున్నా వడ్డీ పథకం అమలుపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

అర్హులందరికీ వర్తింపు



అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని వర్తింపజేస్తున్నాం. నాలుగో విడత సున్నా వడ్డీ సొమ్మును ఈనెల 26న సీఎం జగన్ బటన్ నొక్కి విడుదల చేయనున్నారు. డీఆర్‌డీఏ పరిధిలో ఏలూరు జిల్లాలో 37,658 గ్రూపులకు చెందిన 4,21,572 మంది మహిళలకు రూ.53.79 కోట్ల మేరకు సున్నా వడ్డీ రాయితీ లభించనుంది.
– ఆర్.విజయరాజు, డీఆర్‌డీఏ పీడీ, ఏలూరు

ఇబ్బందులు లేకుండా..



డ్వాక్రా సంఘాలు తీసుకున్న రుణాలను క్రమం తప్పకుండా బ్యాంకులకు చెల్లించిన వాటికి వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం వర్తించేలా చర్యలు తీసుకున్నాం. క్షేత్రస్థాయిలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నాం. పశ్చిమగోదావరి జిల్లా డీఆర్‌డీఏ పరిధిలో 28,874 గ్రూపులకు చెందిన 3,12,705 మంది మహిళలకు రూ.42.86 కోట్ల ప్రయోజనం కలగనుంది.
– ఎంఎస్ఎస్ వేణుగోపాల్, డీఆర్‌డీఏ పీడీ, పశ్చిమగోదావరి

మెప్మా పరిధిలో..



మెప్మా పరిధిలో ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టణ ప్రాంతాల మహిళలకు రూ.18.11 కోట్ల లబ్ధి చేకూరనుంది. క్రమం తప్పకుండా రుణాలు చెల్లించే గ్రూపులకు వడ్డీ రాయితీ వర్తించేలా వివరాలు నమోదు చేశాం. ఏలూరు జిల్లాలో రూ.7.96 కోట్లు, పశ్చిమగోదావరి జిల్లాలో రూ.10.15 కోట్ల మేర మహిళలకు లబ్ధి చేకూరనుంది.
– బి.ఇమ్మానియేలు, పీడీ, మెప్మా, ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాలు

ప్రభుత్వ తోడ్పాటు బాగుంది



మాలాంటి పేదలకు ప్రభుత్వం అందిస్తున్న సహకారం చాలా బాగుంది. బ్యాంకు రుణాలు, ఆసరా, అమ్మఒడి, సున్నా వడ్డీ పథకాలతో ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడుతున్నాం. కష్టకాలంలో మమ్మల్ని ఆదుకునేలా ప్రభుత్వం సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తోంది. అన్నిరకాలుగా ఆదుకుంటున్న సీఎం జగనన్నకు ధన్యవాదాలు.
– మేడిశెట్టి లక్ష్మి, పోతునూరు, దెందులూరు మండలం

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

కలెక్టర్ ప్రశాంతి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం (ప్రకాశంచౌక్): స్పందన అర్జీలకు అర్థవంతమైన సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. భీమవరం కలెక్టరేట్‌లో సోమవారం జిల్లాస్థాయి స్పందన కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.రామసుందర్‌రెడ్డితో కలిసి ఆమె అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన దరఖాస్తులు రీ ఓపెన్ కాకుండా కచ్చిత పరిష్కారం చూపాలన్నారు. అధికారులపై నమ్మకంతో ప్రజలు వస్తున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకుని సంతృప్తి కలిగేలా పరిష్కారం చూపాలన్నారు. స్పందనలో 186 అర్జీలు స్వీకరించారు. కలెక్టర్, జేసీతో పాటు డీఆర్వో కె.కృష్ణవేణి, డీఎల్‌డీఓ కేసీహెచ్ అప్పారావు, డీఎస్పీ బి.శ్రీనాథ్ అర్జీలు స్వీకరించారు. వివిధ శాఖల జిల్లా అధికారులు, వయో వృద్ధుల ట్రిబ్యునల్ సభ్యుడు మేళం దుర్గా ప్రసాదు పాల్గొన్నారు.

అర్జీల్లో కొన్ని..
- తన పంట భూమి వ్యవసాయేతర భూమిగా ఉందని, దీనిని వ్యవసాయ భూమిగా మార్చాలని గణపవరం మండలం సరిపల్లికి చెందిన పోలుపర్తి సూర్యప్రకాశరావు అర్జీ అందజేశారు.
- తనకున్న 10 సెంట్ల కొబ్బరితోటను పట్టాదారు పాస్ పుస్తకంలో నమోదు చేయించాలని ఆచంట మండలం అయోధ్యలంక మర్రిమూల నివాసి కొప్పాడి రాంబాబు అభ్యర్థించారు.
- ఆకివీడు మండలం అజ్జమూరు పంచాయతీ నిధులు దుర్వినియోగమయ్యాయని ఫిర్యాదు చేసిన పంచాయతీ కార్యదర్శి పట్టించుకోవడం లేదని బచ్చు కృష్ణారావు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.

ముంపులోనే కనకాయలంక కాజ్‌వే



కనకాయలంక కాజ్‌వేపై ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి



వరద పరిస్థితిని పరిశీలిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

యలమంచిలి: గోదావరిలో వరద నీరు నిలకడగా ప్రవహిస్తోంది. మండలంలోని కనకాయలంక కాజ్‌వేపై నుంచి ఐదడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. అయితే గ్రామంలోకి వరద నీరు ప్రవేశించలేదు. గ్రామస్తుల రాకపోకల కోసం అధికారులు ఏర్పాటు చేసిన మూడు ఇంజన్ పడవలు నడుస్తున్నాయి. కనకాయలంకలో సోమవారం ఎస్పీ యు.రవిప్రకాష్, డీఎంహెచ్ఓ మహేశ్వరరావు పర్యటించారు. వరద పెరిగే అవకాశం లేదని, ప్రజలు ఆందోళన చెందనక్కర్లేదని ఎస్పీ రవిప్రకాష్ సూచించారు. అత్యవసరమైతేనే పడవలపై రాకపోకలు సాగించాలన్నారు. గ్రామంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని డీఎంహెచ్ఓ మహేశ్వరరావు సందర్శించి వైద్య సేవలపై ఆరా తీశారు. నరసాపురం డీఎస్పీ కె.రవిమనోహరచారి, పాలకొల్లు రూరల్ సీఐ కొండవీటి శ్రీనివాసకుమార్, ఎస్సై జాజుల విజయ్ నాగ ప్రసాద్, సర్పంచ్ మద్దా శ్రీనివాసరావు, డాక్టర్ జాన్‌లియో, వీఆర్వో సరెల్ల లక్ష్మి వారి వెంట ఉన్నారు.

కరోనా బాధితులకు ఆర్థిక సాయం



బాధిత చిన్నారులకు చెక్కులు అందిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

పెంటపాడు: రెండేళ్ల క్రితం కె.పెంటపాడు వీఆర్వో నల్లమిల్లి సత్యనారాయణరెడ్డి కరోనా బారిన పడి రెండేళ్ల క్రితం మృతిచెందగా.. దీనిని తట్టుకోలేక ఆయన భార్య భవానీ కూడా కన్నుమూశారు. దీంతో వారి పిల్లలు రోహిత్‌రెడ్డి, సహస్రసూర్యలక్ష్మి అనాథలయ్యారు. అప్పటినుంచి బంధువుల సంరక్షణలో ఉంటున్న వారి భవిష్యత్ అవసరాల కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కరోనా వారియర్ పథకంలో ఒక్కొక్కరికి రూ.10 లక్షల సాయం మంజూరు చేశారు. కాగా ఈ మేరకు చెక్కులను గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ బాధిత చిన్నారులకు ఆదివారం రాత్రి అందజేశారు. ఉన్నత చదువులు చదివి వృద్ధిలోకి రావాలని ఆకాంక్షించారు. పార్టీ జిల్లా కార్యదర్శి నల్లమిల్లి విజయానందరెడ్డి, సర్పంచ్ సూర్యకళ, ఉపసర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు భాస్కరరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, దేవాబత్తుల బాబి నాగమణి పాల్గొన్నారు.

ముత్యాలమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

మొగల్తూరు: ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ ఆలయంలో హుండీల ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 62 రోజులకు రూ.15,51,739 ఆదాయం లభించినట్లు ఈఓ డి.రామకృష్ణంరాజు తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ వర్ధినేడి వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ మాజీ చైర్మన్లు పాల్గొన్నారు.

గ్రామస్థాయిలోనూ స్వచ్ఛ సర్వేక్షణ్

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాను స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో అద్భుతమైన ఫలితాలు సాధించేలా కృషి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. సోమవారం జగనన్న సురక్ష, హౌసింగ్ తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ అనంతరం స్వచ్ఛ సర్వేక్షణ్ గోడపత్రికను ఆమె ఆవిష్కరించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ ప్రపంచంలోనే అతిపెద్ద పట్టణ పారిశుద్ధ్య, పరిశుభ్రత సర్వే అని, 2022లో పట్టణాల్లో మాత్రమే నిర్వహించామని, 2023లో గ్రామస్థాయిలో కూడా నిర్వహిస్తామన్నారు. ప్రతి పంచాయతీ స్వచ్ఛ సర్వేక్షణ్ సర్వేలో పాల్గొనాలని, వచ్చే ఏడాది 250 పంచాయతీలను లక్ష్యంగా నిర్ణయించామని చెప్పారు.

బహిరంగ మలవిసర్జనతో అనారోగ్యం
బహిరంగ మలవిసర్జనతో రోగాలు ప్రబలే ప్రమాదముందని, దీనిని మానాలని కలెక్టర్ తెలిపారు. బహిరంగ మలవిసర్జన అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఘన వ్యర్థాల నిర్వహణ, మల వ్యర్థాల నిర్వహణ, మలిన వ్యర్థాల నీటి నిర్వహణ, ప్రజలకు అవగాహన, నైపుణ్యత పెంపుపై దృష్టి సారించి సంపూర్ణ స్వచ్ఛత వైపు అడుగు వేద్దామని పిలుపునిచ్చారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, సబ్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, ఆర్డీఓ దాసి రాజు, జిల్లా పంచాయతీ అధికారి జీవీకే మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

వడివడిగా గోడౌన్ల నిర్మాణం

- జిల్లాకు 129 మల్టీపర్పస్ గోడౌన్ల మంజూరు
- మొదటి దశలో 23 చోట్ల నిర్మాణాలు
- రైతులకు సేవలందిస్తున్న 3 గోదాములు
- ప్రారంభోత్సవానికి సిద్ధంగా మరో రెండు
- ఒక్కొక్కటి 500 టన్నుల సామర్థ్యం



తణుకు మండలం కొమరవరంలో రైతులకు అందుబాటులోకి వచ్చిన గోడౌన్

భీమవరం(ప్రకాశం చౌక్): రైతు సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోంది. దీనిలో భాగంగా రైతులు తమ పంటలను నిల్వ చేసుకుని మద్దతు ధర వచ్చినప్పుడు అమ్ముకోవడంతో పాటు ఎరువులు, విత్తనాలు కూడా నిల్వ చేసుకునేలా మల్టీపర్పస్ గోడౌన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పశ్చిమగోదావరి జిల్లాకు మూడు విడతల్లో 129 గోడౌన్లను మంజూరు చేయగా ఫేజ్-1లో 32 గోడౌన్ల నిర్మాణానికి సన్నాహాలు చేసి 23 చోట్ల నిర్మాణాలు చేపట్టారు. వీటి నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. ఆయా మార్కెట్ యార్డ్ పరిధిలో రైతులకు అందుబాటులో ఉంచేలా వీటిని నిర్మిస్తున్నారు.

ఫేజ్1లో 32 గోడౌన్లు
జిల్లాలో 10 మార్కెట్ యార్డ్‌లకు సంబంధించి ఫేజ్-1లో 32 గోడౌన్లను ప్రభుత్వం మంజూరు చేసి స్థల సేకరణ పూర్తిచేసింది. వీటిలో 23 గోడౌన్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. ఒక్కో గోడౌన్ 500 టన్నుల సామర్థ్యంతో రూ.40 లక్షల వ్యయంతో నిర్మిస్తున్నారు. మొత్తంగా తొలివిడతలో రూ.9.20 కోట్లతో నిర్మాణాలు చేపట్టారు. జిల్లాలోని తాడేపల్లిగూడెం మండలం మెట్టఉప్పరగూడెం, పెంటపాడు మండలం రావిపాడు, తణుకు మండలంలోని కొమరవరంలో గోడౌన్ల నిర్మాణాలు పూర్తయి రైతులకు అందుబాటులోకి వచ్చాయి. అలాగే మొగల్తూరు మండలంలోని రెండు గోడౌన్ల నిర్మాణం పూర్తయి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయి.

ప్రత్యేక శ్రద్ధతో..
జిల్లాలోని మిగిలిన గోడౌన్లు 30 నుంచి 70 శాతం నిర్మాణాలు పూర్తిచేసుకున్నాయి. భీమవరం మండలం తుందుర్రులో గోడౌన్ నిర్మాణానికి సంబంధించి కోర్టు కేసు ఉండటంతో పనులు నిలిపివేశారు. మిగిలిన నిర్మాణాలను వేగంగా పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావడానికి మార్కెటింగ్ శాఖ అధికారులు కృషిచేస్తున్నారు. అలాగే కలెక్టర్ పి.ప్రశాంతి కూడా గోడౌన్ల నిర్మాణంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఎప్పటికప్పుడు మార్కెటింగ్, రెవెన్యూ, కో-ఆపరేటివ్ తదితర శాఖల అధికారులతో సమీక్షిస్తూ సూచనలు, సలహాలు ఇస్తున్నారు.

రైతు సంక్షేమమే లక్ష్యంగా..



రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం మల్టీపర్పస్ గోడౌన్ల నిర్మాణాలు చేపట్టింది. జిల్లాలో తొలివిడత నిర్మాణాలు వేగంగా పూర్తిచేసి రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషిచేస్తున్నాం. ఈ గోడౌన్లు రైతులకు అన్నిరకాలుగా ఉపయోగపడేలా ఉంటాయి.
– కె.సునీల్, మార్కెటింగ్ శాఖ ఏడీఏ, భీమవరం

జిల్లాలో గోడౌన్ల నిర్మాణం

మండలం	గ్రామం	నిర్మాణ స్థితి
పెంటపాడు	రావిపాడు	అందుబాటులో
తాడేపల్లిగూడెం	మెట్ట ఉప్పరగూడెం	అందుబాటులో
తణుకు	కొమరవరం	అందుబాటులో
మొగల్తూరు	శేరేపాలెం	నిర్మాణం పూర్తి
మొగల్తూరు	రామన్నపాలెం	నిర్మాణం పూర్తి
ఆకివీడు	అజ్జమూరు	50 శాతం
ఆచంట	ఆచంట	60 శాతం
ఆచంట	పెనుమంచిలి	40 శాతం
కాళ్ల	కాళ్ల	40 శాతం
నరసాపురం	చేమకూరిపాలెం	50 శాతం
నరసాపురం	మల్లవరం	70 శాతం
పాలకోడేరు	మోగల్లు	30 శాతం
పాలకోడేరు	శృంగవృక్షం	60 శాతం
పోడూరు	పండితవిల్లూరు	40 శాతం
పోడూరు	పోడూరు	50 శాతం
భీమవరం	తుందుర్రు	కోర్టు కేసు
పెనుగొండ	చినమల్లం	50 శాతం
కాళ్ల	ఏలూరుపాడు	50 శాతం
ఉండి	మహాదేవపట్నం	40 శాతం
వీరవాసరం	మత్స్యపురి	30 శాతం
గణపవరం	కేశవరం	30 శాతం
గణపవరం	పిప్పర	40 శాతం
పెంటపాడు	అలంపురం	30 శాతం

క్లుప్తంగా

మద్ది హుండీ ఆదాయం రూ.43.50 లక్షలు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం లోని శ్రీమద్ది ఆంజనేయస్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. 62 రోజులకు వచ్చిన కానుకలను లెక్కించగా రూ.43,50782 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి రంగారావు పర్యవేక్షణలో హుండీ లెక్కింపు నిర్వహించారు. ధర్మకర్తల మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

టేబుల్ టెన్నిస్‌లో ఏలూరు క్రీడాకారులకు పతకాలు



కోచ్‌తో టేబుల్ టెన్నిస్ విజేతలు

ఏలూరు రూరల్: రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో ఏలూరు క్రీడాకారులు షీల్డ్స్ సాధించారని టేబుల్ టెన్నిస్ కోచ్ ఘంటా శేఖర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి 23 వరకు పెద్దాపురంలో జరిగిన రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో ఏలూరుకు చెందిన ఎస్.అచ్యుత్ అండర్-13 విభాగంలో పోటీపడి మొదట స్థానంలో నిలిచాడని, అలాగే అండర్-17 బాలికల విభాగంలో ఎం.లినీశ మూడో స్థానం సాధించిందన్నారు. పతకాలు సాధించిన విజేతలను జిల్లా చీఫ్ కోచ్ బి.శ్రీనివాసరావు, సెట్‌వెల్ సీఈఓ ఎండీహెచ్ మెహర్రాజ్ అభినందించారు.

హాస్టల్ కుక్‌పై కేసు

కాళ్ల: స్థానిక ఎస్సీ బాలుర హాస్టల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థినిని హాస్టల్లోని వంటమనిషి కొట్టిన ఘటనపై కాళ్ల పోలీస్ స్టేషన్లో సోమవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం రాజమండ్రికి చెందిన కొవ్వాకుల తేజ కాళ్ల హైస్కూల్లో 8వ తరగతి చదువుతూ ఎస్సీ వెల్ఫేర్ బాలుర హాస్టల్లో ఉంటున్నాడు. ఈ నెల 12న స్కూలుకి వెళ్లకుండా హాస్టల్లో ఉండి పుస్తకాలకు అట్టలు వేస్తుండగా హాస్టల్ వంట మనిషి ఎం.వెంకటేశ్వరరావు పీవీసీ పైపుతో రక్తం వచ్చేటట్లు కొట్టాడు. అయితే సోమవారం విషయాన్ని తెలుసుకున్న విద్యార్థి తల్లి వరలక్ష్మి పోలీసులను ఆశ్రయించింది.

ఈ-క్రాప్.. రైతు సేవలో టాప్

- ఈ-క్రాప్ నమోదుతో ప్రయోజనాలెన్నో
- సంక్షేమ పథకాల లబ్ధి పొందే అవకాశం
- సబ్సిడీపై యంత్రాలు, ఎరువులు, విత్తనాలు
- ఖరీఫ్ పంట వివరాలు నమోదు ప్రారంభం



భీమవరం మండలంలో ఓ పంట వివరాలను ఈ-క్రాప్ యాప్‌లో నమోదు చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: అన్నదాత సంతోషంగా ఉంటేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని రాష్ట్ర ప్రభుత్వం రైతుల మేలు కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోంది. వ్యవసాయం దండగంటూ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతులను తీవ్ర నిరాశ, నిస్పృహలకు గురిచేయగా నేటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయ రంగంలో తీసుకువచ్చిన అనేక వినూత్న పథకాల ద్వారా వ్యవసాయాన్ని పండుగ చేసి చూపించారు. ప్రభుత్వం రైతుల కోసం అమలు చేస్తున్న అనేక కార్యక్రమాల్లో ఈ-క్రాప్ ఒకటి. దీనిలో రైతులు తమ వివరాలను నమోదు చేయించుకోవడం ద్వారా ప్రభుత్వం అనేక ప్రయోజనాలను కల్పిస్తోంది. తక్కువ ధరకే మేలైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందించడమేగాక వ్యవసాయ యంత్ర పరికరాలను పెద్ద మొత్తంలో సబ్సిడీపై అందిస్తోంది. ఈ-క్రాప్‌లో నమోదు ద్వారా వెబ్‌ల్యాండ్‌లో పొందుపర్చిన పంటల ఆధారంగా రాష్ట్రంలో ఏ పంట ఎంత విస్తీర్ణంలో పండిస్తున్నారు, ఎంత దిగుబడి వస్తుందనే అంచనా వేసి దానికి అనుగుణంగా మార్కెట్ సదుపాయం కల్పించేందుకు అవకాశం కలగనుంది.

ప్రయోజనాలివే..

ఈ-క్రాప్ నమోదు వల్ల రైతులకు అనేక ప్రయోజనాలున్నాయి. జిల్లాలో దాదాపు 2.19 లక్షల ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా, 1,17,168 మంది రైతులు, దాదాపు 63 వేల మంది వరకు కౌలు రైతులున్నారు. వీరిలో 58 వేల మందికి ఇప్పటికే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందించారు. ఈ-క్రాప్ ద్వారా రైతులకు ప్రభుత్వం అందించే ఉచిత పంటల బీమా, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ, వడ్డీ రాయితీ వంటివి పొందవచ్చు. అలాగే పండించిన ధాన్యాన్ని మద్దతు ధరకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవచ్చు. ఇన్‌పుట్ సబ్సిడీ, వడ్డీ రాయితీ, పంట పెట్టుబడి సహాయం వంటివి నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతాయి. అంతేకాక అర్హులైన రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్ధి చేరుతుంది.

నమోదు ఇలా..

సార్వా, దాళ్వా సీజన్‌లో గ్రామాల వారీగా ఆర్‌బీకే అసిస్టెంట్స్, వీఆర్వోలు వరినాట్లు వేసిన తరువాత వారు సాగుచేసిన పొలం వద్దనే ఆ రైతు ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో నాట్లు వేశారు, ఏ రకం వరి వంగడాలను సాగుచేశారనే వివరాలను నమోదు చేస్తారు. పొలం వద్దనే రైతు ఫొటోతో సహా వెబ్‌ల్యాండ్‌లో పొందుపరుస్తారు. ఆర్‌బీకే అసిస్టెంట్స్, వీఆర్వోలు నమోదు చేసిన ఈ వివరాలను మండల స్థాయిలో తహసీల్దార్, మండల వ్యవసాయశాఖాధికారి, జిల్లా స్థాయిలో కలెక్టర్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి పరిశీలించి తుది జాబితాలను ఆర్బీకేల వద్ద ప్రదర్శిస్తారు. తరువాత ఏమైనా అభ్యంతరాలుంటే సరిచేస్తారు.

రైతులందరూ నమోదు చేయించుకోవాలి



పంటలకు ఈ క్రాప్ నమోదు రైతులకు ఎంతో ప్రయోజనంగా ఉంటుంది. కేవలం వరి పంటే కాకుండా జిల్లాలో పండించే ఇతర అన్నిరకాల పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేస్తారు. వరినాట్లు వేసిన ప్రతి సీజన్‌లో ఈ-క్రాప్ నమోదు కార్యక్రమం జరుగుతుంది. దీనిలో నమోదు చేసుకుంటేనే రైతులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు దక్కడంతోపాటు రైతు పండించిన ధాన్యం అమ్ముకోడానికి అవకాశం ఉంటుంది. ప్రస్తుతం జిల్లాలో ఈక్రాప్ నమోదు ప్రారంభమైంది. రైతులందరూ తమ పంట వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలి – **జెడ్ వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం**

నిర్మాణ రంగంపై విస్తృత పరిశోధనలు



నిట్‌లో మాట్లాడుతున్న డాక్టర్ ప్రకాష్ నందగోపాలన్

తాడేపల్లిగూడెం: నిర్మాణ రంగంలో అత్యాధునిక సాంకేతిక పద్ధతులను తీసుకురావడానికి దేశంలో విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయని ముంబై ఐఐటీ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యులు డాక్టర్ ప్రకాష్ నందగోపాలన్ అన్నారు. సోమవారం ఏపీ నిట్‌లో ×ఆధునిక నిర్మాణ వస్తువులు, అభ్యాసాల ప్రస్తుత, భవిష్యత్ అవకాశాలు₹ అనే అంశంపై వర్కుషాపు ప్రారంభమైంది. రిజిస్ట్రార్ దినేష్ పి.శంకరరెడ్డి అధ్యక్షత వహించారు. గోపాలన్ మాట్లాడుతూ త్రీడీ కాంక్రీట్ ప్రింటింగ్ టెక్నాలజీ ప్రాధాన్యత, ప్రాముఖ్యతను వివరించారు. ఈ విధానం ద్వారా తక్కువ ఖర్చుతో కాంక్రీట్ నిర్మాణాలను తయారు చేయవచ్చన్నారు. ఏపీ నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ ప్రమోద్ పడోలే ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ నిర్మాణ రంగంలో నిష్ణాతులైన నిపుణుల ఆలోచనలను ఒకరికొకరు పంచుకోవడానికి, నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి వర్కుషాపులు దోహదపడతాయన్నారు. భారత ప్రభుత్వం ఆధ్వర్యంలోని సెర్బ్ డీఎస్‌టీ సహకారంతో ఈ కార్యక్రమం కన్వీనర్‌గా సివిల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ ఎస్.భరణీ ధరన్, కో-ఆర్డినేటర్‌గా డాక్టర్ ఎస్ఎం సుభాని వ్యవహరించారు. డీన్ రీసెర్చ్ అండ్ కన్సల్టెన్సీ డాక్టర్ జీఆర్‌కే శాస్త్రి, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి వి.సందీప్, వివిధ రాష్ట్రాలకు చెందిన 25 మంది పరిశోధకులు పాల్గొన్నారు.

యూత్ సమ్మిట్‌కు ఉద్యాన విద్యార్థులు



యూత్‌సమ్మిట్‌లో ఉద్యాన వర్సిటీ విద్యార్థులు

తాడేపల్లిగూడెం: హైదరాబాద్‌లోని హార్ట్‌ఫుల్‌నెస్ ఇనిస్టిట్యూట్‌లో నిర్వహించిన యూత్ 20వై20 సమ్మిట్‌కు డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ బీఎస్సీ విద్యార్థులు పది మంది హాజరయ్యారు. డిపార్టుమెంటు ఆఫ్ యూత్ అఫైర్సు అండ్ మినిస్ట్రీ ఆఫ్ స్పోర్ట్సు, గవర్నమెంటు ఆఫ్ ఇండియా ఏర్పాటు చేసిన ఈ సదస్సులో దేశం నలుమూలల నుంచి రెండు వేల మంది విద్యార్థులు పాల్గొనగా, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సదస్సు ప్రారంభించారు. శారీరక, మానసిక సంపూర్ణ ఆరోగ్యం అనే అంశంపై వక్తలు సందేశం ఇచ్చారు. ప్రశాంతమైన మనస్సుకు మంచి ఆరోగ్యానికి ఉన్న సంబంధాన్ని ఎయిమ్స్ న్యూఢిల్లీ బృందం వారి పరిశోధనల సారాంశం వివరించారు. ధ్యానం ప్రాముఖ్యతను పద్మభూషణ్ అవార్డు గ్రహీత దాజీ వివరించారు. ప్రపంచమంతా ఒక కుటుంబంగా జీవించాలని, మనం నివసించే ఈ ఒకే భూమిలో ఒకే మాట ఒకే బాటతో మంచి భవిష్యత్ వైపు సాగాలని ఐకమత్యమే బలమని 20వై20 కార్యదర్శి కునాల్ తిలక్ వివరించారని విద్యార్థులు తెలిపారు. ఒలింపియన్ అయోనికపాల్, మానసి జోషి, డాక్టర్ నివేదిత వంటి వారి ప్రసంగాలు ఆకట్టుకున్నాయన్నారు. వీసీ జానకీరామ్ ప్రోత్సాహంతో మంచి అవకాశం వచ్చిందని చెప్పారు. డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్సు సలోమి సునీత, అసోసియేట్ డీన్ మాధవి,పీడీ. టి.రాంబాబు మార్గదర్శనం చేశారు.

మణిపూర్ ఘటనపై లా కళాశాల వద్ద నిరసన



భీమవరం డీఎన్నార్ లా కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: మణిపూర్‌లో మహిళలపై జరిగిన దారుణ ఘటనను ఖండిస్తూ ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ (ఐఎఎల్) ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని డీఎన్నార్ లా కళాశాల వద్ద విద్యార్థులు, న్యాయవాదులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఐఎఎల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చెల్లబోయిన రంగారావు మాట్లాడుతూ మహిళలను రక్షించలేని ప్రభుత్వం దేశాన్ని ఎలా కాపాడుతుందని ప్రశ్నించారు. మణిపూర్ ఘటనను కేంద్ర ప్రభుత్వం మూడు నెలల పాటు బాహ్యప్రపంచానికి తెలియకుండా దాచిందని ఆరోపించారు. మహిళలను నగ్నంగా ఊరేగించిన దుర్మార్గులను ఉరితీయాలని డిమాండ్ చేశారు. ఐఎఎల్ నాయకులు అశోక్‌కుమార్, భాస్కరరావు, చిత్రభాను, వాణి, వీర్రాజు, లా విద్యార్థులు టి.తేజ్, డి.అనిత, పూజిత, బి.చరణ్య, జగదేశ్వరరావు పాల్గొన్నారు.

మన్యంలో ప్రాజెక్టులకు జలకళ

- నిండుకుండలా చెరువులు, ప్రాజెక్టులు
- ఎగువ నుంచి భారీగా వచ్చిన వరద నీరు
- 35 వేల ఎకరాలకు అందనున్న సాగునీరు



నిండుకుండలా ఉన్న పోగొండ రిజర్వాయర్



నిండుగా ఉన్న కొమ్ముగూడెం చెరువు



జల్లేరు జలాశయంలోకి చేరిన వరద నీరు



కొవ్వాడ ప్రాజెక్టులోకి భారీగా చేరిన నీరు

బుట్టాయగూడెం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా గత కొద్దిరోజులుగా వర్షాలు దంచి కొడుతున్నాయి. ప్రతి రోజూ ఎదో సమయంలో వానలు కురుస్తూనే ఉండడంతో మన్య ప్రాంతంలోని చెరువులు, ప్రాజెక్టుల్లోకి వరద నీరు భారీగా వచ్చి చేరింది. దీంతో చెరువులు, ప్రాజెక్టులు నిండుకుండలా మారి జలకళను సంతరించుకున్నాయి.

పుష్కలంగా సాగునీరు

మన్యంలోని సుమారు 128 మైనర్ ఇరిగేషన్ చెరువుల పరిధిలోని సుమారు 30 వేలకు పైగా సాగు భూములు ఉన్నాయి. ఇప్పటికే ఈ భూముల్లో రైతులు వివిధ రకాల పంటలను ఈ ఖరీఫ్ సీజన్‌లో పండిస్తున్నారు. ప్రధానంగా వరి, ప్రత్తి, మొక్కజొన్న, వేరుశనగ, చెరకు పంటలను రైతులు వేశారు. సుమారుగా 18 వేల ఎకరాల భూముల్లో రైతులు పంటలు వేసినట్లు అధికారులు చెబుతున్నారు. అయితే ఈ భూములన్నీ వర్షాలపైనే ఆధారపడి సాగు చేస్తున్నారు. ప్రస్తుతం భారీగా కురుస్తున్న వర్షాలతో చెరువుల్లోకి నీరు చేరడంతో తమకు సాగునీరు కొరత తీరినట్లే అని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా చెరువులు, ప్రాజెక్టుల్లో నీరు భారీగా చేరడంతో భూగర్భ జలాలు కూడా పెరిగే అవకాశం ఉంది. దీనివల్ల బోర్లలో నీరు సమృద్ధిగా లభించనుంది.

జలాశయాలు కళకళ

మన్యప్రాంతంలో ఉన్న గుబ్బల మంగమ్మ జల్లేరు జలాశయం నీటితో కళకళలాడుతుంది. ఈ ప్రాజెక్టు పూర్తి స్థాయి సామర్థ్యం 217.80 మీటర్లు కాగా ప్రస్తుత వర్షాలతో ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు చేరడంతో 212.40 మీటర్లు సామర్థ్యంతో నిండి ఉంది. అదేవిధంగా పోగొండ రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 157 మీటర్లు కాగా సామర్థ్యాన్ని మించి నీరు బయటకు ప్రవహిస్తుంది. అదేవిధంగా కొవ్వాడ ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 90.50 మీటర్లు కాగా ప్రస్తుతం 87.50 మీటర్లుతో ప్రాజెక్టులో నీరు నిల్వ ఉంది.

మన్యంలో చెరువులు, ప్రాజెక్టుల వివరాలు	
మొత్తం చెరువులు	128
100 ఎకరాల పైబడిన చెరువులు	40
చిన్న చెరువులు	81
చెక్‌డ్యామ్‌లు	48
ఆనకట్టలు	300
ప్రాజెక్టులు	3

అప్రమత్తంగా ఉన్నాం



భారీ వర్షాలు కురుస్తుండడంతో చెరువుల పరిస్థితిపై అప్రమత్తంగా ఉన్నాం. చెరువులకు గండ్లు పడకుండా చర్యలు తీసుకుంటున్నాం. చెరువులు, ప్రాజెక్టుల్లో భారీగా నీరు ఉండడంతో ఆయకట్టు రైతులకు పుష్కలంగా నీరు అందించేందుకు కృషి చేస్తాం. ప్రస్తుతం ఖరీఫ్‌కి నీటి కొరత లేదు. అలాగే రబీలో కూడా సాగునీరు అందించేలా కృషి చేస్తాం.
– **టి.సురేష్, మైనర్ ఇరిగేషన్ ఏఈ, కేఆర్‌పురం**

దివ్యాంగుడికి డాక్టరేట్



ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా పీహెచ్‌డీ అందుకుంటున్న రమేష్‌బాబు

తణుకు: ఆంధ్రా యూనివర్సిటీలో కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో తణుకు పట్టణానికి చెందిన దివ్యాంగుడు కొప్పాక రమేష్ బాబు చేసిన పరిశోధనకు యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. పెట్టుబడి నిర్ణయాలను ప్రభావితం చేసే అంశాల ఆధారంగా ఉభయగోదావరి జిల్లాల్లోని పెట్టుబడిదారుల అవగాహనపై రమేష్‌బాబు ఆచార్య జాలాది రవి పర్యవేక్షణలో పరిశోధన చేశారు. తణుకు పాతవూరుకు చెందిన రమేష్‌బాబు డిగ్రీ వరకు తణుకులోనే విద్యాభ్యాసం కొనసాగించి అనంతరం పీజీ, పీహెచ్‌డీ విశాఖపట్టణంలోని ఆంధ్రా యూనివర్సిటీలో పూర్తి చేశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య పీవీజీవీ ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా పీహెచ్‌డీ ప్రొసీడింగ్స్ అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం రమేష్‌బాబును పలువురు అభినందించారు.

విద్యుదాఘాతానికి కూలీ మృతి



నాగేశ్వరరావు మృతదేహం

టి.నరసాపురం: ఆయిల్ పామ్ తోటలో గెలలు కోస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ కూలీ అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. టి.నరసాపురానికి చెందిన దొంత నాగేశ్వరరావు (40) ఆయిల్ పామ్ తోటలో గెలలు కోసే పనులకు వెళుతుంటాడు. టి.నరసాపురంలో ఓ రైతుకు చెందిన ఆయిల్‌పామ్‌తోటలో ఇనుపగెడతో సోమవారం గెలలు కోస్తున్నాడు. అయితే ప్రమాదవశాత్తు చెట్టుకు సమీపంలో ఉన్న విద్యుత్ వైరుకు గెడ తగలడంతో షాక్‌కు గురై ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. నాగేశ్వరరావుకు వివాహం కాగా, భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య దొంతా రజిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.సతీష్‌కుమార్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

రైలు నుంచి జారిపడి పంజాబ్ వాసి మృతి



లాల్టూ విశ్వాస్ మృతదేహం

దెందులూరు/ఏలూరు టౌన్: రైలులో ప్రయాణిస్తూ జారి పడటంతో సోమవారం ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఏలూరు రైల్వే ఎస్సై డి.నర్సింహరావు చెప్పారు. మృతుడి జేబులో లభించిన ఆధార్ కార్డు ఆధారంగా ఈ వ్యక్తి పంజాబ్ రాష్ట్రానికి చెందిన లాల్టూ విశ్వాస్ (32)గా గుర్తించామన్నారు. గుర్తు తెలియని రైలులో ప్రయాణిస్తూ దెందులూరు వద్ద జారిపడటంతో మృతి చెందాడన్నారు. మృతదేహాన్ని ఏలూరు మర్చూరీలో భద్రపరిచామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆవు మృతిపై సుమోటోగా కేసు

ఆకివీడు: స్థానిక గుమ్ములూరు సెంటర్లో ఈ నెల 21న గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆవు మృతి చెందిన ఘటనపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై భీమవరం ఫస్ట్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు సుమోటోగా కేసు స్వీకరించింది. ఈ మేరకు మెజిస్ట్రేట్ ఉత్తర్వులు జారీ చేశారు. జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆవు మృతి చెందగా, ఆవు మృతికి కారణమైన వాహనాన్ని గుర్తించి, సంబంధిత వ్యక్తులపై, సమగ్ర విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఆకివీడు పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. ఐపీసీ 429, సెక్షన్ 11 జంతు హింస చట్టం, సెక్షన్ 27 గోసంరక్షణ చట్టం కింద కేసులు నమోదు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. గుర్తు తెలియని వాహనం ఆచూకీ తెలుసుకునేందుకు సీసీ ఫుటేజీలను సేకరించి ఈ నెల 31 లోగా నివేదిక కోర్టుకు సమర్పించాలని ఆకివీడు పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు.

మణిపూర్‌లో క్రైస్తవులపై దాడులను అరికట్టాలి




మాట్లాడుతున్న ఫాదర్ పి.జీవన్ కుమార్

ఏలూరు (టూటౌన్): మణిపూర్ ఘటనలో బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని ఏపీ పాస్టర్స్ ఫెడరేషన్ జనరల్ సెక్రటరీ ఫాదర్ పి.జీవన్ కుమార్ కోరారు. స్థానిక జిల్లా పరిషత్ అతిథిగృహంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో పౌరులంతా సమానమేనని అలాంటప్పుడు కులాలు, మతాలపరంగా వేరు చేసి దాడులు చేయడం, అత్యాచారాలు చేయడం హేయమైన చర్య అన్నారు. మణిపూర్ అల్లర్లలో ఇప్పటివరకు 600 చర్చిలను, వేలాది గృహాలను దగ్ధం చేశారని, వేలాది మంది గాయాలపాలయ్యారన్నారు. దీనిపై రాష్ట్రపతి తక్షణం జోక్యం చేసుకుని మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ తక్షణ చర్యలు చేపట్టి క్రైస్తవులకు రక్షణ కల్పించాలని కోరారు. ఇండియన్ దళిత క్రిస్టియన్ రైట్స్ జాతీయ అధ్యక్షులు పెరికే వరప్రసాద్ మాట్లాడుతూ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని, క్రైస్తవుల హక్కులకు భంగం కలుగకుండా రక్షణ కల్పించాలన్నారు. నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు మున్నుల జాన్ గురునాథ్, దళిత జేఏసీ జాతీయ నాయకులు పొలిమేర హరికృష్ణ, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డి.అబ్రహం మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్రంలో మారణహోమాన్ని అదుపు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం శాంతి ర్యాలీ నిర్వహించి డీఆర్వో సత్యనారాయణమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఫాదర్లు రత్నప్రసాద్, జి.జాన్ పీటర్, చిక్కాల జోసెఫ్, ఎస్ఎల్ పాల్, పాస్టర్లు పాల్గొన్నారు.

ఆకలికి తట్టుకోలేక రైలులో చోరీ

- బాలుడిని పోలీసులకు అప్పగించిన ప్రయాణికులు
- చైల్డ్‌కేర్ హోమ్‌కు తరలించిన రైల్వే పోలీసులు



చైల్డ్‌కేర్ సిబ్బందికి బాలుడ్ని అప్పగిస్తున్న రైల్వే పోలీసులు

ఏలూరు టౌన్: బీహార్ రాష్ట్రానికి చెందిన ఓ బాలుడు రైలులో ప్రయాణిస్తూ ఆకలికి తట్టుకోలేక ఒక ప్రయాణికుడి బ్యాగ్‌లో రూ.200 చోరీ చేశాడు. దీనిని గమనించిన ప్రయాణికులు బాలుడ్ని ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్‌లో రైల్వే పోలీసులకు అప్పగించారు. ఏలూరు రైల్వే ఎస్ఐ డీ.నరసింహారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాందేడ్-విశాఖపట్నం రైలులో బీహార్ రాష్ట్రం సమస్తిపూర్ జిల్లా, కనోజ్ గ్రామానికి చెందిన గోలు కుమార్ (16) ప్రయాణించాడు. రైలు రాయనపాడు రైల్వేస్టేషన్ సమీపానికి సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటలకు చేరింది. ఆ సమయంలో ఏ1 బోగీలో ఆకలికి తట్టుకోలేక ప్రయాణికుడి బ్యాగ్‌లో నుంచి రూ.200 చోరీ చేశాడు. బాలుడ్ని ఏలూరు రైల్వేస్టేషన్‌లో ఎస్సై నరసింహారావుకు అప్పగించారు. బాలుడిపై ఎలాంటి చర్యలు తీసుకోవద్దని కోరటంతో ఎస్సై 1098 చైల్డ్ కేర్‌కు ఫోన్ చేసి హోమ్‌కు తీసుకువెళ్లారు. బాలుడు కుమార్ తాను చదువుకుంటానని చెప్పటంతో చైల్డ్‌కేర్ హోమ్‌కు తరలించి, ఆశ్రయం కల్పిస్తామని తెలిపారు.

ఆగని వర్షం.. స్తంభించిన జన జీవనం

- ముసురు కారణంగా ఉపాధి కరువై కూలీల అవస్థ
- నాట్లు వేసిన వరి పొలాల్లోకి వర్షం నీరు


మెట్ట ఉప్పరగూడెం - మోదుగ గుంట రహదారిలో గొడుగుతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న యువకులు


మెట్ట ఉప్పరగూడెం శివారులో వరి చేలోకి చేరిన వర్షం నీరు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో సోమవారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. రెండ్రోజులుగా అడపా దడపా కురుస్తున్న వర్షానికి తోడు కావడంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. మరో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది. దీంతో ప్రజానీకం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇంటి నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మరో నాలుగు రోజులు ఇలానే ఉంటే కూలీ, నాలీ చేసుకునే కుటుంబాలకు పూటగడటమే కష్టంగా మారుతుంది. రూరల్ మండలంలోని ఎల్.అగ్రహారం, మెట్ట ఉప్పరగూడెం, మోదుగగుంట, అప్పారావుపేట, దండగర్ర, ఉప్పరగూడెం తదితర గ్రామాల్లోని వరి చేలలోకి వర్షపు నీరు చేరింది. నాలుగు రోజుల పాటు వర్షాలు ఇలానే కురిస్తే వరి నాట్లు మునిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ నెల 10న కురిసిన వర్షానికి నాట్లు నీట మునగడంతో బోదెలు ఏర్పాటు చేసి, ముంపు నీటిని బయటకు పంపించారు. అనంతరం నాట్లు తేరుకోవడానికి పురుగు మందులను పిచికారీ చేశారు. దీంతో అదనపు పెట్టుబడులు అవసరమైందని రైతులు వాపోతున్నారు. మరలా ముసురు పట్టుకోవడం రైతులను ఆవేదనకు గురి చేస్తోంది.

రహదారుల గుంతల్లోకి వర్షం నీరు

వర్షాలకు గ్రామాల్లోని రహదారులపై ఏర్పడిన గుంతల్లోకి నీరుచేరింది. ప్రధానంగా మెట్ట ఉప్పరగూడెం, దండగర్ర, జగన్నాథపురం, ఆరుగొలను, ఎల్.అగ్రహారం, పుల్లాయగూడెం తదితరగ్రామాల్లోని రహదారులు ఛిద్రంగా మారాయి. అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఎక్కడి నీరు అక్కడే నిలబడిపోయే పరిస్థితి నెలకొంది. ఈ వర్షాలు ఇక్కడితోనైనా ఆగితే బాగుంటుందని రైతులు, కూలీలు కోరుకుంటున్నాయి. గడిచిన 24గంటల్లో 2.8మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని తహసీల్దార్ వై.దుర్గాకిషోర్ సోమవారం తెలిపారు.

సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలి

రానున్న నాలుగైదు రోజులు ఒక మోస్తారు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. దీంతో ప్రజలు శిథిలావస్థలో ఉన్న భవనాలు, పూరి గుడిసెలు, చెట్ల కింద ఉండరాదు. సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలి. అత్యవసర పరిస్థితుల్లో స్థానికంగా రెవెన్యూ సిబ్బందిని సంప్రదించాలి.

– వై.దుర్గాకిషోర్, తహసీల్దార్, తాడేపల్లిగూడెం

బోదెల ద్వారా నీటిని దిగువకు మళ్లించాలి

వర్షాలకు నీరు వరి చేలలో నిల్వ లేకుండా నీటిని దిగువకు మళ్లించాలి. లేకుంటే నాట్లు కుళ్లిపోయే ప్రమాదం ఉంది. వర్షాలు తగ్గే వరకు ఎటువంటి పురుగు మందులు పిచికారీ చేయవద్దు.

– ఆర్ఎస్.ప్రసాద్, మండల వ్యవసాయాధికారి, తాడేపల్లిగూడెం మండలం

క్లుప్తంగా

బస్ పాస్‌ల పంపిణీ


బస్సు పాస్‌లను అందజేస్తున్న డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏపీఎస్ ఆర్టీసీ తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ యేలూరి సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో సోమవారం పిప్పర జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులకు ఉచిత బస్ పాస్‌లు పంపిణీ చేశారు. పూర్వ విద్యార్థి, ప్రస్తుతం బస్ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న కేసీహెచ్ రామిరెడ్డి సౌజన్యంతో 100 మంది చిన్నారులకు ఉచిత బస్ పాస్‌లకు సహకరించారు. ఆర్టీసీ డీఎం మాట్లాడుతూ ప్రస్తుతం నడుస్తున్న 4 బస్‌లకు అదనంగా మరో బస్ సర్వీస్ ప్రవేశపెట్టామని అన్నారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పీఆర్‌టీ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దోమల నియంత్రణతో వ్యాధులు దూరం


మహిళలకు అవగాహన కల్పిస్తున్న సబ్ యూనిట్ ఆఫీసర్ లక్ష్మణరావు తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పరిసరాల పరిశుభ్రతతో సీజనల్ వ్యాధులకు దూరంగా ఉందామని మలేరియా సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. పట్టణంలో కడకట్ల ఆరోగ్య కేంద్రం పరిధిలో 28వ వార్డులో 50వ విడత ఫీవర్ సర్వేలు, కీటక జనిత ప్రదేశాల గుర్తించటపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా ఇంటింటికీ ర్యాలీగా వెళ్లి ప్రజలకు దోమలు, వివిధ వ్యాధులు, నివారణ అనే అంశాలపై అవగాహన కల్పించారు. దోమల నియంత్రణకు డ్రై డే, ఫ్రై డే పాలించాలని లక్ష్మణరావు ప్రజలను కోరారు. వార్డు ఆరోగ్య కార్యదర్శులు చంద్రకళ, ఆశా కార్యకర్తలు అనురాధ, వలంటీర్లు, శానిటేషన్ కార్యదర్శులు, వార్డు ఇన్‌చార్జి అర్జునరావు, ఆరోగ్య సహాయకులు కాంతారావు పాల్గొన్నారు.

వాకర్స్ సేవలు అభినందనీయం


భవిత కేంద్రంలోని విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేసిన మహిళా వాకర్స్

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని సుబ్బారావుపేట భవిత దివ్యాంగుల పాఠశాలలో ఎయిర్‌స్ట్రిప్ మహిళా వాకర్స్ అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి అధ్యక్షతన సోమవారం దివ్యాంగుల పిల్లలకు నోట్ బుక్స్, పెన్సిళ్లు, పలకలు, బిస్కెట్లు, చాక్లెట్లు అందజేశారు. విజయలక్ష్మి మాట్లాడుతూ వాకర్స్ విద్యా సేవా కార్యక్రమంలో భాగంగా దివ్యాంగుల పిల్లలకు విద్యా సామగ్రి అందజేయడం సంతోషంగా ఉందన్నారు. భవిత సెంటర్ నిర్వాహకులు బాలీశ్వరయ్య మాట్లాడుతూ మహిళ వాకర్స్ సేవలు అభినందనీయమన్నారు. ఈ సేవా కార్యక్రమంలో కుంట్ల కనకదుర్గ, ప్రభావతి, రామలక్ష్మి, ఇందిరా కుమారి, అరుణ కుమారి, ఉదయ కుమారి, లక్ష్మి పాల్గొన్నారు.

ఇన్‌కం ట్యాక్స్ రిటర్న్స్ దాఖలు చేసుకోండి


మాట్లాడుతున్న పెన్షనర్ల అసోసియేషన్ కార్యదర్శి మూర్తి

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఇన్‌కం ట్యాక్స్ పరిధిలోకి వచ్చే ప్రభుత్వ పెన్షనర్లు ఈ నెల 31వ తేదీలోగా తప్పక రిటర్న్స్ దాఖలు చేసుకోవాలని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యదర్శి వైవీఎస్ మూర్తి కోరారు. పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో ఉపాధ్యక్షుడు అర్జునరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఇప్పటి వరకు బకాయిలు పడిన పీఆర్‌సీ ఎరియర్స్, డీఆర్‌లు చెల్లించాలని కోరుతూ తీర్మానం చేశారు. వి.కె.వీరారావు, వై.వి.సత్యనారాయణ, గరికపాటి సుబ్రహ్మణ్య శర్మ, ఎం.డి. ముస్తాఫా, కె.సత్యనారాయణ, వి.విశ్వంరాజు తదితర సభ్యులు పాల్గొన్నారు.

నేడు రెండు గ్రామాల్లో జగనన్న సురక్ష సభలు

పెంటపాడు: మండలంలోని రావిపాడు, పెంటపాడు-3లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా గ్రామ సభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జీవీ శేషగిరిరావు తెలిపారు. ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే సమావేశాల్లో ప్రజలు సమస్యలు తెలియజేయాలని ఆయన కోరారు. దరఖాస్తుదారులకు ధ్రువపత్రాలు అందిస్తామన్నారు.

ఉమ్మడి పౌరస్మృతితో దేశానికి ప్రమాదం


తణుకులో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు

తణుకు: కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న ఉమ్మడి పౌరస్మృతి దేశంలోని అన్ని తరగతుల ప్రజలకు ప్రమాదమని రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు అన్నారు. సోమవారం స్థానిక అమర వీరుల భవనంలో సీఐటీయూ ఆధ్వర్యంలో కామన మునిస్వామి అధ్యక్షత సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బాబూరావు మాట్లాడుతూ నరేంద్రమోదీ ప్రభుత్వం వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో లబ్ధి పొందడానికే ఈ చట్టం తీసుకువస్తోందన్నారు. దేశంలో అనేక జాతులు, సంస్కృతులు, మతాలు మధ్య ఎన్నో విభజన అంశాలు ఉన్న నేపథ్యంలో ఉమ్మడి పౌరస్మృతి సాధ్యం కాదన్న సంగతి మోదీకి అవగాహన లేకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి.దక్షిణామూర్తి, గుబ్బల గోపి, ఎస్.ఆదినారాయణబాబు, వల్లూరి వెంకటేశ్వరరావు, గోవిందరాజు, నాగేంద్ర, అయ్యప్ప, రమేష్ పాల్గొన్నారు.

మణిపూర్‌లో మహిళలకు రక్షణ కల్పించాలి


తణుకులో నిరసన తెలియజేస్తున్న మహిళా సంఘం నాయకులు

తణుకు: మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని, మహిళలకు రక్షణ కల్పించాలని ప్రజా సంఘాల మహిళలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసీ మహిళను వివస్త్రను చేసి ఊరేగించిన ఘటనకు నిరసనగా సోమవారం తణుకు నరేంద్ర సెంటర్‌లో మహిళలు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర నాయకులు ఎ.అజయకుమారి మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న దాడులు భారతమాతకు జరిగిన అవమానంగా భావించాలన్నారు. మహిళలకు రక్షణ కల్పించలేని మణిపూర్ రాష్ట్ర ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రముఖ సామాజికవేత్త సంకు మనోరమ, మహిళా నాయకులు సీహెచ్ వరలక్ష్మి, హాలీయా, నల్లి రాణి, పి.రమణమ్మ, ధనలక్ష్మి, సుశీల పాల్గొన్నారు.

కౌలు రైతులకు రుణాలు మంజూరు చేయాలి


కడియద్ద చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడుతున్న ఏవో ప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: కొత్తగా కౌలు కార్డులు తీసుకున్న రైతులకు రుణాలు మంజూరు చేయాలని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ బ్యాంకు అధికారులను కోరారు. సోమవారం మండలంలోని కడియద్ద చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు మేనేజర్‌ను కలిసి కౌలు రైతులకు రుణాల మంజూరు విషయమై మాట్లాడారు. ఈ సందర్భంగా ఏవో ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో కొత్తగా 4,796 మందికి కౌలు గుర్తింపు కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. కౌలు రుణాలు తిరిగిచెల్లించే విషయంలో వ్యవసాయ శాఖ, ఆర్‌బీకేలు బాధ్యత తీసుకుంటాయన్నారు. రుణాల విషయంలో వ్యవసాయ శాఖకు సహకరించాలని కోరారు. దీనిపై బ్యాంకు మేనేజర్ హర్షద్ మాట్లాడుతూ రుణాలు తిరిగి చెల్లించిన వారికి కొత్త రుణాలు ఇస్తున్నామని బదులిచ్చారు. ఆయన వెంట కడియద్ద ఆర్‌బీకే ఇన్‌ఛార్జ్ ముప్ప వీర్రాజు ఉన్నారు.

వరిసాగులో వెదజల్లే పద్ధతి లాభదాయకం


కేవీకేలో వెదజల్లే పద్ధతిలో వరిసాగు చేస్తున్న రైతు

ఉండి: వరిసాగు చేసేందుకు రైతులు అనుసరిస్తున్న పద్ధతుల్లో వెదజల్లే పద్ధతి అన్నింటికంటే లాభదాయకమైందని ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారం కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.మల్లికార్జునరావు అన్నారు. సోమవారం కృషి విజ్ఞానకేంద్రంలో వరిసాగులో చేపట్టే పలు పద్ధతులపై ప్రదర్శనా క్షేత్రాన్ని శాస్త్రవేత్తలు ప్రారంభించారు.ఈ సందర్భంగా వరిసాగులో వెదజల్లే పద్ధతి రైతులకు చాలా అనువైందని అన్నింటికంటే రైతుకు లాభాలు తెచ్చే పద్ధతి అని వివరిస్తూ రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మల్లిఖార్జునరావు మాట్లాడుతూ ప్రస్తుతం నాలుగు పద్ధతుల్లో వరిసాగు చేపడుతున్నారన్నారు. నాట్లు వేసే పద్ధతి, బెంగాల్ ప్లాంటింగ్, డ్రమ్ సీడర్, వెదజల్లే పద్ధతిలో రైతులు వరిసాగు చేస్తున్నారన్నారు. వీటన్నింటిలో వెదజల్లే పద్ధతి రైతులకు ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. ఈ పద్ధతి పాటించడం ద్వారా రూ.6 వేల నుండి రూ.7 వేల వరకు రైతులు సాగు ఖర్చు తగ్గించుకోవచ్చునని సూచించారు. ఎకరాకు 15 కేజీల విత్తనాలు చల్లుకోవాలన్నారు. చల్లుకునే ముందుగా వరిచేను బాగా చదును చేసుకుని రెండు మీటర్లకు ఒకటి చొప్పున చిన్న చిన్న దారులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.వీటివల్ల అధిక వర్షాలు వచ్చిన సమయంలో ముంపు ఇబ్బందులు ఉండవన్నారు. వెదజల్లిన 3 రోజుల నంతరం పైరజోల్ సల్ఫూరాన్ ఇథైల్ అనే కలుపు మందును ఎకరాకు 80 మి.లీ. చల్లుకోవాలని రైతులకు సూచించారు.

వైభవంగా దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం


ఆలయంలో సామూహిక కలశపూజలు నిర్వహిస్తున్న దృశ్యం


కలశాలతో అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న మహిళా భక్తులు

కాళ్ల: మండలంలోని కోమటిగుంట గ్రామంలో కొలువైయున్న శ్రీ దుర్గాదేవి దేవస్థానం తృతీయ వార్షికోత్సవ కార్యక్రమాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా 108 కలశాలతో గోక్షీర సహిత పంచామృతములు, పుణ్య నది జలాలతో మహిళా భక్తులు అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించి అభిషేకం చేశారు. ఆలయ నిర్మాణకర్తలు ఎరుబండి రామాంజనేయులు, రత్నకుమారి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళా భక్తులు పాల్గొని ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ నిర్మాణకర్తల సహకారంతో అఖండ అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

వరి నాట్లు ముమ్మరం

తణుకు టౌన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో కురుస్తున్న వర్షాలతో ప్రజలు సతమతమయ్యారు. మూడు రోజులుగా కురుస్తున్న చినుకులతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సోమవారం తెల్లవారు జాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండటంతో జన జీవనానికి ఇబ్బందులు ఏర్పడ్డాయి. మరో వైపు వర్షాలతో మండలంలోని వ్యవసాయ పనులు వేగంగా సాగుతున్నాయి. రెండు రోజులుగా ఒక మోస్తరుగా వర్షాలు కురుస్తుండటంతో వ్యవసాయ పనులు ముఖ్యంగా చేలలో దమ్ము పనులు, వరినాట్లు ముమ్మరంగా చేపట్టారు.

కార్మిక, కర్షక సమస్యలను కేంద్రం తీర్చాలి

పెంటపాడు: కేంద్ర ప్రభుత్వం కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాలు విడనాడాలని రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చింతకాయల బాబూరావు పేర్కొన్నారు. పెంటపాడు ప్రజాసంఘాల కార్యాలయం వద్ద సోమవారం ఈనెల 30న విజయవాడలో నిర్వహించనున్న కార్మిక, కర్షక సదస్సు విజయవంతం కోరుతూ ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో కార్మిక కర్షక సమస్యలు తీవ్రంగా ఉన్నాయన్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల ఆత్మహత్యలు విపరీతంగా పెరిగాయన్నారు. పంటకు గిట్టుబాటు ధర రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాలు కేంద్రానికి పట్టడం లేదన్నారు. సీఐటీయూ ఉపాధ్యక్షుడు శిరపరపు రంగారావు, రైతు సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు చిర్ల పుల్లారెడ్డి, కరక వెంకట్రావు, బంకూరు నాగేశ్వరరావు, సత్తి కోదండ రామిరెడ్డి, యాండ్రపు కృష్ణ, కొయ్యాన శ్రీను, పెనగంటి దుర్గ, విజయరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు


పెంటపాడులో విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

పెంటపాడు: వేగంగా వస్తున్న కారు అదుపుతప్పి పెంటపాడులో ఒక విద్యుత్ స్తంభాన్ని సోమవారం ఢీ కొట్టింది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఎవరికీ గాయాలు కాలేదు. కారు వేగానికి విద్యుత్ స్తంభం విరిగింది. విద్యుత్ వైర్లు తెగిపడకపోవడం వల్ల పెనుప్రమాదం తప్పింది. కె.పెంటపాడు నుంచి పెంటపాడు వచ్చేదారిలో మూల తూం మలుపు వద్ద ఈ ప్రమాదం జరిగింది. స్థానికులు భయందోళనకు గురయ్యారు.

విద్యతోనే సమాజాభివృద్ధి

వీరవాసరం: విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందని ఆర్డీఓ దాసిరాజు తెలిపారు వీరవాసరం శివారు యానాదులు కాలనీలోఉన్న ప్రాంతాన్ని సోమ వారం ఆయన పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిబయట తిరుగుతున్న పిల్లలు ఎక్కువగా ఈ ప్రాంతంలో ఉన్నారని సమాచారం మేరకు ఇక్కడకు వచ్చామన్నారు చదువుకోవడం ద్వారా విద్యార్థితోబాటు ఆ కుటుంబం కూడా అభివృద్ధి దిశలో సాగుతుందన్నారు పాఠశాలకు వెళ్లకుండా ఏ ఒక్క పిల్లవాడు ఉండకూడదని వివరించారు.

వైభవంగా దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

కాళ్ల: మండలంలోని కోమటిగుంట గ్రామంలో కొలువైయున్న శ్రీ దుర్గాదేవి దేవస్థానం తృతీయ వార్షికోత్సవ కార్యక్రమాన్ని సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా 108 కలశాలతో గోక్షీర సహిత పంచామృతములు, పుణ్య నది జలాలతో మహిళా భక్తులు అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించి అభిషేకం చేశారు. ఆలయ నిర్మాణకర్తలు ఎరుబండి రామాంజనేయులు, రత్నకుమారి దంపతుల ఆధ్వర్యంలో ప్రత్యేక హోమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళా భక్తులు పాల్గొని ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ నిర్మాణకర్తల సహకారంతో అఖండ అన్నసమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

కూలిరేట్లు పెరిగే వరకు పోరాటం

ఉండి: కష్టపడి పనిచేసే వ్యవసాయ కూలీల రేట్లు పెరిగే వరకు సీపీఐ ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మిక సంఘం పోరాటాలు చేస్తూనే ఉంటుందని శాఖ రాష్ట్రాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు.రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా 25వ మహాసభను ఉండి ఏఎంసీలో సోమవారం సంఘ జిల్లా అధ్యక్షుడు సనపల శ్రీనివాస్, ఉల్లింకల జయకృష్ణ,సీహెచ్ సరోజిని ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్‌లకు దోచిపెట్టడం తప్ప ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేదలను మరచిపోయారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కలిశెట్టి వెంకట్రావు, జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు పాల్గొన్నారు.

వలంటీర్లకు వందనం

కరోనా కష్టకాలంలో అండగా నిలిచిన వలంటీర్లు


మంత్రి కొట్టు సత్యనారాయణ, కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వలంటీర్ చెల్లా రమాదేవి

తాడేపల్లిగూడెం (టీఓసీ): కరోనా కష్టకాలంలో ప్రజలకు వ్యాధి నిర్ధారణ పరీక్షలు దగ్గర ఉండి చేయించడం, కరోనా సోకిన వారిని క్వారంటైన్‌కు పంపడం, బాధితులకు నిత్యావసర వస్తువులు అందజేయడం, రెడ్‌జోన్‌లలో సేవలు అందించడం, ప్రభుత్వం నుంచి మంజూరైన పింఛన్లు లబ్ధిదారులకు అందజేయడం వంటి సేవలు అందించి వలంటీర్లు ప్రజలకు దగ్గరయ్యారు. వలంటీర్లను ప్రజలు తమ కుటుంబ సభ్యులు మాదిరిగా భావిస్తున్నారు. వలంటీర్ చెల్లా రమాదేవి అందించిన ఉత్తమ సేవలను వార్డులోని ప్రజలు కొనియాడుతున్నారు. ఈమె సేవలకు అర్బన్ పరిధిలో చెల్లా రమాదేవి సేవా వజ్ర పురస్కారం అందుకున్నారు.

వలంటీర్ సేవలు ఎనలేనివి



స్థానిక 14వ వార్డు మేదర పేట, డెయిలీ మార్కెట్‌లో నేను నివాసం ఉంటున్నాను. మా వార్డు క్లస్టర్ వలంటీర్ చెల్లా రమాదేవి అందిస్తున్న సేవలు ఎనలేనివి. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అమలు అవుతున్న అన్ని సంక్షేమాలను ప్రజలకు చేరవేయడంలో వార్డు వలంటీర్ కృషి అభినందనీయం. మాకు పింఛన్, చేయూత, రైస్‌కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు అందించారు. అవి ఎంతగానో ఉపయోగపడ్డాయి. చాలా సంతోషంగా ఉంది. వార్డు వలంటీర్‌కు అభినందనలు

– గ్రంధి రమణకుమారి, గృహిణి, 14వ వార్డు

వలంటీర్ల సేవలు అభినందనీయం



స్థానిక 14వ వార్డు మేదర పేట, డెయిలీ మార్కెట్‌లో నేను నివాసం ఉంటున్నాను. మా వార్డు క్లస్టర్ వలంటీర్ చెల్లా రమాదేవి అందిస్తున్న సేవలు కొనియాడదగినవి. వార్డులో వలంటీర్ ఇంటింటికీ తిరుగుతూ ఎప్పటికప్పుడు ఆరోగ్య సమాచారం తెలుసుకుంటారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు, కొత్తగా వచ్చే పథకాలు, తదితర విషయాలను ఎప్పటికప్పుడు తెలియజేస్తూ అర్హులకు అందించడం అభినందనీయం. ప్రభుత్వం నుంచి పెన్షన్ అందుకుంటున్నాను. అమ్మఒడి, విద్యా దీవెన తీసుకున్నాను.

– రొట్టా ప్రసాద్, 14వ వార్డు, మేదర పేట

మద్దాల నాగేశ్వరరావుకు ఘన నివాళి


అత్తిలిలో మద్దాల నాగేశ్వరరావు జయంత్యుత్సవంలో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు

అత్తిలి: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, అత్తిలి ఏఎంసీ మాజీ చైర్మన్ స్వర్గీయ మద్దాల నాగేశ్వరరావు జయంతిని సోమవారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించారు. అత్తిలి కెనాల్ రోడ్డులో ఉన్న మద్దాల నాగేశ్వరరావు విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మద్దాల నాగేశ్వరరావు ప్రజలకు అందించిన సేవలను పలువురు నాయకులు కొనియాడారు. పార్టీ కార్యాలయం వద్ద కేకు కట్ చేసారు. కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, మండల పార్టీ అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, జెడ్పీ కోఆప్షన్ మెంబర్ మహ్మద్ అబీబుద్దీన్, సర్పంచ్ గంటా విజేత నాగరాజు, ఉప సర్పంచ్ మద్దాల శ్రీనివాస్, మద్దాల బాపిరాజు, మద్దాల రత్నకుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు కందుల సత్యనారాయణ, రంభ సూరిబాబు, ఆకుల చినబాబు, చిటకన వెంకట్రావు, పోలినాటి చంద్రరావు పాల్గొన్నారు.

సీహెచ్‌సీ వైద్య సేవలు భేష్


భీమవరం ఏరియా ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య సేవలు పరిశీలిస్తున్న కేరళ బృందం

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం ఏరియా (సీహెచ్‌సీ) సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలు బాగున్నాయని కేరళ వైద్యం బృందం ప్రతినిధి ఓమెన్ మాథ్యూస్ కితాబిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్యరంగంలో ఆరోగ్య పథకాల అమలు పరిశీలనలో భాగంగా సోమవారం పీఆర్సీ (పాపులేషన్ రిసోర్స్ సెంటర్ బృందం) భీమవరం సీహెచ్‌సీ సందర్శించారు. ఆస్పత్రిలో పేషెంట్లు, బాలింతలకు అందుతున్న వైద్య సేవలు, నిర్వహణ, రికార్డులను, ఫార్మసీ, ల్యాబ్, డెంటల్ విభాగాలతో పాటు మందులు వినియోగాన్ని వారు పరిశీలించారు. జనాభాకు సరిపడే విధంగా సీహెచ్‌సీకి అవసరమైన వసతులను సమకూర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిక సమర్పిస్తామని మథ్యూస్ చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా గణాంక అధికారి ఎమ్మెస్ ప్రసాద్, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఎం.వీరస్వామి, ఎల్‌డీ కంప్యూటర్ పీవీ భాస్కరరావు పాల్గొన్నారు.

శెట్టిబలిజ మండల కమిటీ ఎన్నిక

వీరవాసరం: శెట్టిబలిజ సంక్షేమ సంఘం వీరవాసరం మండల కమిటీ నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నామని సంఘ నాయకులు సోమవారం తెలిపారు. శెట్టిబలిజ సంక్షేమం సంఘం మండల అధ్యక్షుడిగా దొంగ వెంకట దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడిగా వేంద్ర దివాకర్, పితాని కోటేశ్వరరావు, మల్లుల శ్రీను, పాల మహేంద్ర, ప్రధాన కార్యదర్శిగా కోడి నరసింహం ,సహాయ కార్యదర్శిగా వీరవల్లి తిరుపతి వెంకటేశ్వరరావు, వీరవల్లి ప్రవీణ్‌లను ఎన్నుకున్నమాని పేర్కొన్నారు.

భార్యను వేధిస్తున్న భర్తపై కేసు

కాళ్ల: కట్టుకున్న భార్యను వేధిస్తున్నారంటూ బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం కాళ్ళ పోలీసులు కేసు నమోదు చేశారు. కాళ్ల గ్రామశివారు గాంధీనగర్‌కు చెందిన మహిళకు 2019 లో రేవు నాగేంద్రబాబుతో వివాహం అయ్యింది. కొంత కాలం బాగానే చూసుకున్న తన భర్త ఈ మధ్య కాలంలో వేధిస్తున్నాడని దీనికి అత్త సహకరిస్తున్నారని బాధితురాలు కోర్టును ఆశ్రయించింది. కోర్టు నుంచి వచ్చిన ఆదేశాల మేరకు కాళ్ల ఎస్సై ఏజీఎస్ మూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అయ్యంకి జయంతి

ఉండి: జాతీయ గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య 133వ జయంతి వేడుకలను ఉండి మండలం యండగండి శాఖా గ్రంథాలయంలో సోమవారం నిర్వహించారు. గ్రంథాలయ అధికారి ఎస్.రామకృష్ణ ఆధ్వర్యంలో వెంకటరమణయ్య చిత్రపటానికి విద్యార్థులు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ వేగేశ్న సత్యరాజ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కోఆపరేటివ్ బ్యాంక్ కార్యదర్శి సీహెచ్ రవికుమార్ పాల్గొన్నారు.